సాక్షి
నల్లగొండ
బుధవారం, 2, జూలై, 2025





**బీళ్లుగానే ఉంటాయా..!**
ఈ సీజన్‌లో ఎస్సారెస్పీ నీళ్లు వస్తాయా.. భూములు బీళ్లుగానే ఉంటాయా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. - 8లో



**చిట్టీల వ్యాపారి అరెస్ట్**
చిట్టీలు కట్టించుకుని మోసం చేసి పారిపోయిన చిట్టీల వ్యాపారిని మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



**కల్వర్టు గోడను ఢీకొట్టిన..**
ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ హైవేపై కల్వర్టు గోడను ఢీకొట్టడంతో 10మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. - 8లో

## న్యూస్‌రీల్

### నేడు నల్లగొండకు మంత్రుల రాక

- ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై సమీక్ష



భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : నల్లగొండకు బుధవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి రానున్నారు. నల్లగొండలోని కలెక్టరేట్ ఉదయాదిత్య భవన్‌లో ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై వారు సమీక్షించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి మంత్రుల సమీక్షకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. సమీక్షించే అంశాలపై నోట్స్ తయారీ, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తదితర ఏర్పాట్లలో ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంత్రులు ప్రారంభించనున్న ఆర్అండ్‌బీ ఎస్ఈ కార్యాలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ బి.వెంకటేశ్వరరావు, ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఈ ఫణిజ, గణేష్‌కుమార్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పుణ్య, కలెక్టరేట్ ఏఓ మోతిలాల్ పాల్గొన్నారు.

### పోర్చుగల్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులు

నల్లగొండ : తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో పోర్చుగల్‌లో ప్రైవేట్ ఉద్యోగాలకు ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.పద్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోర్చుగల్‌లో ఖాళీగా ఉన్న ఎఫ్అండ్‌బీ మేనేజర్, హౌజ్ కీపర్, వెయిటర్, మెయిన్‌టెయిన్స్ టెక్నీషియన్, ఎగ్జిక్యూటివ్ టెక్నీషియన్, కుక్, కిచెన్ అసిస్టెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఈవెంట్ కోఆర్డినేటర్ తదితర ఉద్యోగాలకు అర్హత గల అభ్యర్థులు tom com.resume@gmail.com వెబ్‌సైట్‌కు రెజ్యూమ్‌లను పంపాలని పేర్కొన్నారు. అర్హత, తదితర పూర్తి వివరాలకు 9440052592, 9440049937 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### పథకాలను వినియోగించుకోవాలి

డిండి : ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి సూచించారు. మంగళవారం డిండి మండల మహిళ సమాఖ్య సంఘాల నూతన కార్యవర్గాలకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలైన అద్దె బస్సులు, సోలార్ ప్లాంట్లు, డ్రోన్‌లు, ప్రమాద బీమా, పేదరిక నిర్మూలన తదతర అంశాలపై నూతన మహిళ సంఘ బంధాల సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం పురుషోత్తం పాల్గొన్నారు.

### ఉచిత శిక్షణకు దరఖాస్తులు

నల్లగొండ : అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంబీసీ నిరుద్యోగ యువతకు వివిధ నైపుణ్యాలకు సంబంధించిన కోర్సుల్లో నాలుగు రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి నిజాంఅలీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 30 సంవత్సరాల వరకు వయసు కలిగిన, డిగ్రీలో ఉత్తీర్ణులైన ఎంబీసీ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాని పొందాలని తెలిపారు. tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువీకరణపత్రాలను జతచేసి ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా నల్లగొండ కలెక్టరేట్‌లోని బీసీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

### ఉపాధ్యాయులు టీచింగ్ డైరీ రాయాలి

నాంపల్లి : ప్రతి ఉపాధ్యాయుడు టీచింగ్ డైరీ రాయాలని డీఈఓ భిక్షపతి అన్నారు. మంగళవారం ఆయన నాంపల్లి జెడ్పీహెచ్ఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. బోధనోపకరణాలు ఉపయోగించి బోధించడంతో పాటు పాఠ్య ప్రణాళికలను తయారు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధన తీరు పరిశీలించారు. విద్యార్థుల చేత స్వయంగా బోర్డుపై ఉన్న అడిషన్స్‌ను చదివించారు. అనంతరం భవిత కేంద్రం, ప్రైమరీ స్కూల్‌ను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంఈఓ మల్లికార్జునరావు ఉన్నారు.

# వీధుల్లో చెత్త.. రోడ్లపైన మురుగు!

## మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య లోపం

- ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేస్తున్న పట్టణవాసులు
- పూడికతో నిండిన డ్రెయినేజీలు
- దోమలు, ఈగలు, దుర్వాసనతో అల్లాడుతున్న జనం
- సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం
- పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని ప్రజల విన్నపం

మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యం లోపించింది. మున్సిపాలిటీ ట్రాక్టర్లు రోజూ చెత్త సేకరణ చేస్తున్నా.. కొందరు మున్సిపల్ సిబ్బందికి ఇవ్వకుండా ఖాళీ స్థలాలు, రోడ్ల వెంట చెత్త పడేసి వెళ్తున్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడవేయడం వల్ల దోమలు, ఈగలు విజృంభించడంతోపాటు దుర్వాసన వస్తోంది. గాలి దుమారానికి సమీపంలోని ఇళ్ల ముందు వరకు చెత్త కొట్టుకుపోతోంది. తడి, పొడి, హానికరమైన చెత్తను వేరు చేసి మున్సిపల్ కార్మికులకు అందించాలని కొన్నేళ్లుగా వార్డుల్లో ప్రజలకు అవగాహన కల్పించినా అమలుకు నోచుకోవడంలేదు. మరోవైపు మురుగుకాల్వలు పూడిక నిండిపోతున్నాయి. చాలా చోట్ల సిబ్బంది కొరత కారణంగా.. డ్రెయినేజీల్లో పూడిక తీయడం లేదు. దీంతో దుర్వాసన, దోమలతో జనం అల్లాడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే ఈ సమయంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.



నల్లగొండ పట్టణంలోని ఎస్పీటీ మార్కెట్ లోపల చెత్త కుప్ప

### నీలగిరిలో రోడ్లపైనే చెత్త..

నల్లగొండ టూటౌన్ : ఉమ్మడి జిల్లాలోనే నీలగిరి మున్సిపాలిటీ పెద్దది. ఇక్కడ రాత్రి, పగలు కలిపి మొత్తం 690 మంది కార్మికులు రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రతి రోజు 100 మెట్రిక్ టన్నులకు పైగానే చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో సమయానికి చెత్త వాహనం రాలేదని కొందరు, రోజూ రాదని ఇంకొందరు, ఇంట్లో ఉంటే దుర్వాసన వస్తుదని మరికొందరు చెత్తను రోడ్లపై పడేస్తున్నారు. ఈ పరిస్థితి ఎక్కువగా ఎస్పీటీ మార్కెట్, హిందూపూర్, పొట్టిగడ్డ, అక్కచల్మ, అబ్బాసియా కాలనీ, శాంతినగర్, బీటీఎస్, శ్రీరాంనగర్, పానగల్ రోడ్‌లో కనిపిస్తోంది. మున్సిపల్ సిబ్బందికి చెత్త అందించాలని గతంలోనే ఆయా కాలనీల ప్రజలకు అవగాహన కల్పించినా వారిలో మార్పు రావడం లేదు.

**మురుగుతో దుర్వాసన...**
పట్టణంలోని డీవీకే రోడ్డు, చైతన్యపురి, సూర్యవంశీకాలనీ, హిమగిరి కాలనీ, పానగల్ రోడ్ శ్రీనగర్ కాలనీ, శ్రీరాంనగర్ కాలనీ, రామగిరి నుంచి సావర్కర్‌నగర్ వెళ్లే రోడ్, ముషంపల్లి రోడ్, రహ్మత్‌నగర్, బీటీఎస్ తదితర ప్రాంతాల్లో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. కొన్నిచోట్ల డ్రెయినేజీ కాల్వలు ఉన్నా ప్లాస్టిక్ కవర్లు, ఇతర చెత్త, చెదారంతో అవి నిండిపోయాయి. శివారు కాలనీల్లో డ్రెయినేజీ స్థానికులను వేధిస్తుంది. ఆయా కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులు పూర్తి అయితే శివారు కాలనీల్లో డ్రెయినేజీ సమస్య తీరనుంది.



చందమామ అపార్ట్‌మెంట్ ఎదురుగా మురుగు కాల్వలో చెత్త, చెదారం



గాంధీనగర్ వద్ద మురుగు కాల్వలో పేరుకుపోయిన పూడిక

### హాలియాలో చెత్త కంపు



హాలియా బస్టాండ్ వద్ద చెత్త కుప్ప

హాలియా : హాలియా మున్సిపాలిటీలో 12 వార్డులు ఉండగా చెత్త సేకరణ కోసం 51 మంది పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు. చెత్త సేకరణకు ఆరు ఆటోలు, మూడు ట్రాక్టర్లు ఉన్నాయి. అయినా పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతోంది. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం చెత్తచెదారంతో పేరుకుపోయింది. రోజూ చెత్తను సేకరిస్తున్నామని మున్సిపల్ సిబ్బంది చెబుతున్నారే తప్ప.. నివాసాల వద్దకు వచ్చి సేకరించడం లేదు. దీంతో ఇళ్లలో పేరుకుపోయిన చెత్తను జనం బహిరంగ ప్రదేశాల్లో వేస్తున్నారు. ఈ చెత్తను తీయకపోవడంతో ఆ ప్రాంతాలు పందులు, కుక్కలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఇక వానాకాలంలో చిన్నపాటి వర్షానికే పట్టణంలోని డ్రెయినేజీలు పొంగిపొర్లుతున్నాయి. ఖాళీ స్థలాల్లో మురుగు నిలిచి, పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి దోమలు విజృంభిస్తున్నాయి. ఇక ఇళ్ల నిర్మాణాలు జరిగే ప్రాంతాల్లో కొత్త డ్రెయినేజీల నిర్మాణం ఊసే లేకపోవడంతో మురుగు రోడ్లపై పారుతోంది. దీంతో దుర్గంధంలో జనం అల్లాడుతున్నారు. మురుగు నీరు నిల్వ ఉన్న చోట కనీసం బ్లీచింగ్ ఫౌడర్, కెమికల్ స్ప్రే కూడా చేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీలను రోజూ శుభ్రం చేయడంతో పాటు వార్డుల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

### అరకొర సిబ్బందితో అంతంత మాత్రంగానే..



నకిరేకల్ 11వ వార్డులో పూడిపోయిన డ్రెయినేజీ

నకిరేకల్ : నకిరేకల్ మున్సిపాలిటిలో మొత్తం 20 వార్డులు ఉన్నాయి. రోజూ చెత్తను తరలించేందుకు రెండు ట్రాక్టర్లు, ఆరు ఆటోలు వినియోగిస్తున్నారు. మొత్తం 71 మంది పారిశుద్ధ్య సిబ్బంది పని చేస్తున్నారు. వీరు డ్రెయినేజీలను శుభ్రం చేయడం పాటు.. వాహనాల ద్వారా ఇంటింటా చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. సిబ్బంది తక్కువగా ఉండడంతో పారిశుద్ధ్య పనులు పూర్తి స్థాయిలో చేయడం లేదు. దీంతో కొన్ని వీధుల్లో నెలల తరబడి డ్రెయినేజీల్లో పేరుకుపోయిన పూడికను తొలగించడం లేదు. చాలా చోట్ల రోడ్లు వెంట చెత్త కూడా దర్శనమిస్తోంది.

### దుర్గంధం వెదజల్లుతున్న మిర్యాలగూడ వీధులు



బంగారుగడ్డలో ఖాళీ స్థలంలో చెత్త



మిర్యాలగూడలో రోడ్డుపై పారుతున్న మురుగు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీలో మొత్తం వార్డు 48 ఉన్నాయి. మొత్తం 278 కార్మికులు 18 ట్రాక్టర్లు, 48 ఆటోల ద్వారా రోజూ రోజూ 50 మెట్రిక్ టన్నులు చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అయినా మున్సిపాలిటీలో రోడ్లు, వీధుల వెంట చెత్త కుప్పలు.. కుప్పలుగా కనిపిస్తోంది. చెత్తను పూర్తిగా తరలించకుండా కొన్ని చోట్ల చెత్తను అక్కడే కాలుస్తున్నారు. దీంతో దుర్వాసన, పొగతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు కాలనీల్లోని ఖాళీ స్థలాల్లోనూ చెత్త వేస్తుండడంతో దోమల బెడద పెరిగి జనం అల్లాడుతున్నారు. ఇక డ్రెయినేజీలు పూడికతో నిండిపోయాయి. ప్రధాన నాలాలు ఇటీవల కొంత పూడిక తీసినా.. వీధుల్లోని మురుగుకాల్వలు చెత్తాచెదారంతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి.

### చెత్తకుప్పలుగా ఓపెన్ ప్లాట్లు



దేవరకొండలో ఓ మురుగు కాల్వ ఇలా..

దేవరకొండ : దేవరకొండ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. దేవరకొండ మున్సిపాల్టీ పరిధిలో మొత్తం 20 వార్డులు ఉండగా దాదాపు 40వేలపైచిలుకు జనాభా ఉన్నట్లు అంచనా. నిత్యం దాదాపు 16టన్నుల చెత్తను మున్సిపల్ అధికారులు పట్టణంలోని సేకరిస్తున్నారు. 11 ఆటోలు, ట్రాక్టర్లు ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. మొత్తం 77మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. అయినప్పటికీ ఓపెన్ ప్లాట్లు, ఖాళీ ప్రదేశాల్లో జనం చెత్త వేస్తున్నారు. చెత్తను బయట పడవేస్తే జరిమానా విధిస్తామని అధికారులు చెబుతున్నా.. పట్టించుకోవడం లేదు. పట్టణంలోని శివారు కాలనీల్లో మురుగుకాల్వల నిర్మాణం లేకపోవడం.. డ్రెయినేజీలు ఉన్న చోట నిర్వహణ సరిగా లేకపోవడంతో పలు చోట్ల రోడ్లపైనే మురుగు పారుతోంది. దీంతో జనం దుర్వాసన, దోమలు, ఈగల బెడదతో అల్లాడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

## శరవేగంగా నెల్లికల్లు ఎత్తిపోతల పనులు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : నెల్లికల్లు ఎత్తిపోతల పనులు శరవేగంగా సాగుతున్నాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మొత్తం 11 గ్రామాల్లోని 24,624 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఈ ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఆమె నెల్లికల్ ఎత్తిపోతల పథకం పంప్‌హౌజ్, పైపులైన్ నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వర్షం వల్ల పనులు ఆగిపోకుండా ముందే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులను భద్రతను సైతం దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ప్రెస్సర్ మెయిన్(పైప్‌లైన్)కు సంబంధించి భూసేకరణ అవార్డు పాస్ చేసి.. చెల్లింపులు చేస్తున్నామన్నారు. కెనాల్‌కు సంబంధించి సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆమె వెంట మిర్యాలగూడెం సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, ప్రాజెక్టు డీఈ సీతారాం, ఏఈ రవి, పెద్దవూర తహసీల్దార్ శ్రీనివాసరావు, ఏజెన్సీ ప్రతినిధులు ఉన్నారు.

### వైద్య వృత్తి పవిత్రమైనది



డాక్టర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : సమాజంలో వృత్తి వైద్య పవిత్రమైనదని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నేషనల్ డాక్టర్స్‌డే సందర్భంగా మంగళవారం ఆమె తన క్యాంపు కార్యాలయంలో ఉత్తమ సేవలందించిన డాక్టర్లను శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ ఆపద సమయంలో ఆపద్బాంధవుల్లా కనిపించే వైద్యులను ప్రజలు గౌరవిస్తారన్నారు. మనిషికి ఎంత సంపద ఉన్నా అనుభవించే ఆరోగ్యం లేకపోతే వృథా అన్నారు. అనారోగ్యంతో బాధపడే వారిని కాపాడే శక్తి కేవలం వైద్యులకే ఉందన్నారు. ప్రజలకు మంచి వైద్య సేవలు అందించి అందరి మన్ననలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్, డీసీహెచ్ఎస్ డాక్టర్ మాతృనాయక్, డిప్యూటీ డీఎంహెచ్ఓలు డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవలో భాగస్వాములు కావాలి



ఇస్మాయిల్ దంపతులను సన్మానిస్తున్న మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్

నల్లగొండ : ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం సమాజ సేవలో భాగస్వాములు కావాలని మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ కోరారు. మంగళవారం నల్లగొండలో నార్కట్‌పల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ.ఇస్మాయిల్ పదవీవిరమణ సన్మానసభలో ఆయన మాట్లాడారు. 42 సంవత్సరాలుగా ఇస్మాయిల్ అధ్యాపక వృత్తిలో అంకితభావంతో పనిచేశారని పేర్కొన్నారు. వృత్తిపై నిబద్ధత గల వ్యక్తి ఎండి ఇస్మాయిల్ అని కొనియాడారు. అనంతరం ఇస్మాయిల్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో డీఐఈఓ దస్రూనాయక్, టీజీఓ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎండీ.ముజుముద్దీన్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# మాతా, శిశు మరణాలు తగ్గాయ్!

- సత్ఫలితాలిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ కార్యక్రమాలు
- గర్భం దాల్చిన నుంచి తల్లీబిడ్డ ఇల్లు చేరేవరకు పర్యవేక్షణ
- వాట్సప్ గ్రూప్‌లో రెఫరల్ కేసుల వివరాలు
- తగిన చికిత్స అందిస్తున్న వైద్యులు



నల్లగొండ టౌన్: వైద్య ఆరోగ్య శాఖ చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలతో జిల్లాలో మాతా, శిశు మరణాల రేటు తగ్గుముఖం పట్టింది. ఆరేళ్ల క్రితం వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన మౌలిక వసతులు లేకపోవడంతోపాటు సకాలంలో వైద్యం అందకపోవడంతో మాతా, శిశు మరణాల రేటు ఎక్కువగా ఉండేది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రుల్లో అన్నిరకాల మౌలిక సదుపాయలు కల్పించింది. ప్రత్యేక వైద్యులను నియమించింది. దీనికితోడు నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి అనుబందంగా మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసి నిష్ణాతులైన ప్రొఫెసర్లు, అసిస్టెంటు ప్రొఫెసర్లు, స్టాఫ్ నర్సులను నియమించింది. వైద్య పరీక్షల కోసం అత్యాధునిక పరికరాలను సమకూర్చింది. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, నవజాత శిశువులకు అవసరమైన ఐసీయూ, కేఎంసీతోపాటు అన్ని విభాగాలను ఏర్పాటుచేసి వైద్యసేవలను మెరుగుపర్చింది. ఫలితంగా ఆరేళ్లుగా మాతా శిశు మరణాల సంఖ్య ఏటేటా తగ్గుముఖం పట్టింది.

**మాతా, శిశు మరణాల వివరాలు..**

| సంవత్సరం | మాత | శిశు |
|---|---|---|
| 2018-19 | 14 | 335 |
| 2019-20 | 18 | 395 |
| 2020-21 | 08 | 329 |
| 2021-22 | 26 | 310 |
| 2022-23 | 13 | 317 |
| 2023-24 | 12 | 216 |
| 2024-25 | 10 | 221 |

**వాట్సప్ గ్రూప్‌లో వివరాలు**
జిల్లాలోని మిర్యాలగూడ, నకిరేకల్, దేవరకొండ, నాగార్జునసాగర్ ఏరియా ఆసుపత్రులకు ప్రసవాల కోసం వెళ్లిన వారికి ఏవైనా ఇబ్బందులు తలెత్తితే అత్యవసర చికిత్స కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారు. రెఫర్ చేసిన వెంటనే ఆయా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు ఎంసీహెచ్ వాట్సప్ గ్రూప్‌లో గర్భిణుల వివరాలు, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, అందించాల్సిన వైద్యం వివరాలను నమోదు చేస్తున్నారు. ఆ వాట్సప్ గ్రూప్‌లో ఎంసీహెచ్ ఇన్‌చార్జి, గైనిక్ హెచ్‌వోడీ, చిన్నపిల్లల విభాగం ఇన్‌చార్జి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి, ఇతర విభాగాల ఇన్‌చార్జిలు ఉంటారు. దీనివల్ల వెంటనే వైద్యులు అలర్ట్ అయ్యి రోగి రాగానే సకాలంలో వైద్యం అందిస్తున్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో కూడా అందించలేని పరిస్థితి ఉంటే వారిని హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా, నీలోఫర్ వంటి ప్రభుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. రిఫర్ చేసిన వెంటనే రాష్ట్ర స్థాయిలో ఎంసీహెచ్ వాట్సప్ గ్రూప్‌లో రోగి వివరాలు నమోదు చేస్తున్నారు. వెంటనే ఆయా ఆసుపత్రుల అధికారులను అప్రమత్తం చేసి సకాలంలో వైద్యం అందేలా చూస్తున్నారు.

### మరణాల సంఖ్య తగ్గుతుంది



ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్నిరకాల వైద్య సదుపాయాలున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ చేపట్టిన చర్యలు మంచి ఫలితాలనిస్తున్నాయి. గర్భిణుల్లో కూడా చైతన్యం వచ్చింది. మంచి పౌష్టికాహారం తీసుకుని వైద్యుల సలహాలు పాటిస్తున్నారు. తద్వారా మాతా శిశు మరణాల సంఖ్య తగ్గుతుంది.

– డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్ఓ

### గర్భిణుల నమోదు నుంచే పర్యవేక్షణ

మహిళలు గర్భం దాల్చిన దగ్గర నుంచి ప్రసవం తర్వాత తల్లిబిడ్డలను ఇంటికి చేర్చే వరకు వైద్య ఆరోగ్య శాఖ నిత్యం పర్యవేక్షిస్తోంది. క్షేత్ర స్థాయిలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు.. గర్భిణుల వివరాలు నమోదు చేసుకుంటున్నారు. వారిని పరీక్షల నిమిత్తం ప్రతినెలా ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకెళ్తున్నారు. టీకాలు వేయించడం రక్తహీనత అధికమించేందుకు మందులను ఇప్పించడం పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. నెలలు నిండగానే 102 వాహనంలో దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకెళుతున్నారు. కాన్పు జరిగిన అనంతరం తల్లిబిడ్డను ప్రభుత్వ వాహనంలో ఇంటికి చేరుస్తున్నారు. నిత్య పర్యవేక్షణతో మాతా శిశుమరణాల సంఖ్య తగ్గిందని వైద్య ఆరోగ్య శాఖ చెబుతోంది.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : కార్మికుల హక్కుల సాధనకు ఈనెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మార్కెండేయ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సీఐటీయూ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల సమస్యలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. కొత్త చట్టాల వల్ల కార్మికులకు కనీస వేతనం అందదని, శ్రమకు తగ్గ వేతనం రాదని, శ్రమ దోపిడీకి గురవుతారని అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ ఈనెల 5న అన్ని మండల కేంద్రాల్లో మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించాలని, 9వ తేదీ వరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలపాలన్నారు. 9న చేపట్టే సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, తిరుపతి రామ్మూర్తి, బావండ్ల పాండు, రవినాయక్, రొండి శ్రీనివాస్, దయానంద్, కేశవులు, పార్వతి, సైదులు, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

## క్లుప్తంగా

### ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

**సూర్యాపేటటౌన్:** తాను అద్దెకు ఉంటున్న ఇంట్లో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం జరిగింది. మంగళవారం సూర్యాపేట పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం గాయంవారిగూడెం గ్రామానికి చెందిన గంట యోగి(21) సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం తాను అద్దెకు ఉంటున్న రూంలో చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. యోగి ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని మృతుడి తండ్రి కనకయ్య సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సూర్యాపేట పట్టణ పోలీసులు తెలిపారు.

### జెడ్పీహెచ్‌ఎస్‌లో సీసీ కెమెరాల అపహరణ

**చిలుకూరు:** చిలుకూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని సీసీ కెమెరాలను సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం పాఠశాలకు వచ్చిన ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి సీసీ కెమెరాలు చోరీకి గురైనట్లు గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాధు చేశారు. గతంలోనూ రెండుసార్లు సీసీ కెమెరాలు చోరీకి గురైనట్లు హెచ్‌ఎం ఫిర్యాధులో పేర్కొన్నారు. ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు పాఠశాలను సందర్శించి చోరీ జరిగిన తీరును పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ మేరకు విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

**నేరేడుచర్ల:** మద్యం మత్తులో ఉన్న యువకుడు.. అతడి సమీప బంధువుపై కత్తితో దాడి చేసి గాయపర్చాడు. ఈ ఘటన సోమవారం రాత్రి నేరేడుచర్ల పట్టణంలో జరిగింది. ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని చింతబండలో నివాసముంటున్న చింతలచెరువు మురళి సోమవారం రాత్రి ఇంట్లో ఫంక్షన్ చేస్తున్నాడు. ఈ ఫంక్షన్‌కు అతడి సమీప బంధువు అయిన చింతలచెరువు శివను పిలవకపోయినా వచ్చాడు. పాత కక్షలను మనసులో పెట్టుకొని మద్యం మత్తులో ఉన్న శివ తన వెంట తెచ్చుకున్న కత్తితో మురళిపై దాడి చేశాడు. దీంతో మురళి చేతికి బలమైన గాయమైంది. బంధువులు వెంటనే మురళిని ఆస్పత్రికి తరలించారు. మంగళవారం బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితుడు శివ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

# నీళ్లొస్తాయా.. బీళ్లుగానే ఉంటాయా..!

**ఎస్సారెస్పీ రెండోదశ ఆయకట్టు రైతన్నల ఆందోళన**

- ఇప్పటికే మూడు సీజన్ల నుంచి ఎండుతున్న ఆయకట్టు పొలాలు
- 70వేల ఎకరాలకు మించి అందని నీళ్లు
- సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో 2.20లక్షల ఎకరాల ఆయకట్టు


సూర్యాపేట జిల్లాకు ఎస్సారెస్పీ నీటిని అందించే ప్రధాన కాలువ (ఫైల్)

**సూర్యాపేట:** శ్రీరాంసాగర్ ప్రాజెక్టు(ఎస్సారెస్పీ) రెండో దశ ఆయకట్టు రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. గత మూడు సీజన్ల నుంచి ఈ ఆయకట్టు పొలాలు ఎండుతూనే ఉన్నాయి. ప్రధాన కాల్వ మినహా ఎక్కడా నీరు పారని పరిస్థితి. ఈ నేపథ్యంలో సూర్యాపేటతో పాటు మహబూబాబాద్ జిల్లాల్లో సుమారు 2.20 లక్షలకు పైగా ఆయకట్టు భూములున్నా.. కనీసం 60 నుంచి 70వేల ఎకరాల్లో కూడా పంటలు పండిన దాఖలు లేవు. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో ఈసారైనా తమ భూములకు నీళ్లు వస్తాయా..? బీడు భూములుగానే ఉంటాయా..? అనే ఆందోళనలో రైతులు ఉన్నారు.

**నాన్ ఆయకట్టు నుంచి..**

2018కు ముందు సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాలు పూర్తిగా నాన్ ఆయకట్టు ప్రాంతాలు. కేవలం వర్షాధార పంటలే పండేవి. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలతో పాటు ఇతర ప్రాంతాలు కలిపి 2,29,961 ఎకరాలు నాగార్జునసాగర్, 15,230 ఎకరాలు మూసీ ఆయకట్టు కింద ఉండేది. 2018 వానాకాలం నుంచి 2023 వానాకాలం వరకు రెండు పంటలకూ నీళ్లు అందాయి. ఈ సమయంలో తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల పరిధిలో మెట్ట పంటలను సాగు చేసిన రైతులంతా వరి వైపు మళ్లారు. వేలాది రూపాయలు వెచ్చించి మెట్ట భూములను తరి భూములుగా మార్చారు. దీంతో సూర్యాపేట జిల్లాలో ఓ వైపు కృష్ణమ్మ, మరోవైపు మూసీనది, ఇంకోవైపు గోదావరి జలాలు పారడంతో త్రివేణి సంగమ జిల్లాగా మారిపోయి దాదాపు 5,85,464 ఎకరాల ఆయకట్టులో వరి పండింది.

**గత మూడు సీజన్ల నుంచి ఇబ్బందులు..**

2023 యాసంగి నుంచి సూర్యాపేట జిల్లా రైతాంగానికి సాగునీటి కష్టాలు వచ్చాయి. వర్షాభావ పరిస్థితులతో ఈ సీజన్‌లో ఆరు తడి పంటలకు మాత్రమే నీటిని వదిలారు. అయినా కొందరు వరినాట్లు, మరికొందరు ఆరుతడి పంటలు వేసి తీవ్రంగా నష్టపోయారు. 2024 –25 వానాకాలంలో చాలా ఆలస్యంగా సెప్టెంబర్ మాసంలో నీటిని విడుదల చేశారు. అప్పటికే పంటల కాలం చివరి దశకు రాగా.. జిల్లాలోని ఎస్సారెస్పీ ఆయకట్టు భూములన్నీ పడావు పడి ఉన్నాయి. 2024–25 యాసంగిలో ఎస్సారెస్పీ మొదలుకొని ఎల్‌ఎండీ వరకు సమృద్ధిగా జలాలు ఉన్నప్పటికీ అరకొర నీటినే విడుదల చేశారు. ఈ క్రమంలో తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని భూములకు మాత్రమే నీళ్లు అందాయి. ఇక సూర్యాపేట నియోజకవర్గ పరిధిలో మొయిన్ కాలువ వెంట అందగా, కోదాడ నియోజకవర్గంలోని మోతె, కోదాడ మండలాల వరకు నీళ్లు రానేలేదు. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభమైన క్రమంలో నీటి పారుదల శాఖ యాక్షన్ ప్లాన్‌లో జిల్లాలోని ఎస్సారెస్పీ రెండోదశకు పూర్తిస్థాయిలో నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఆయకట్టు రైతాంగం కోరుకుంటుంది.

**నీళ్లు రావడం లేదు**



ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలోని భూములకు మూడు సీజన్ల నుంచి నీళ్లు సక్రమంగా రావడం లేదు. తక్కువ నీటిని విడుదల చేయడంతో తూములకు ఎక్కడం లేదు. ఏటా 7 ఎకరాల భూమి కౌలు తీసుకుని సాగు చేస్తుంటా. గత మూడు సీజన్ల నుంచి ఈ భూమి బీడుగానే ఉంది. కౌలు తప్పడం లేదు. ఈ వానాకాలమైనా అధికారులు చివరి భూముల వరకు నీళ్లొచ్చేలా చూడాలి.

– గుద్దేటి మధుసూదన్‌రెడ్డి, ఆత్మకూర్ (ఎస్) మండలం

**ఎస్సారెస్పీ నీటికి ఇబ్బందులు పడుతున్నాం**



ఎస్సారెస్పీ ఆయకట్టుకు నీళ్లు వస్తాయో.. రావో తెలియక ఇబ్బందులు పడుతున్నాం. మూడు సీజన్ల నుంచి చాలా ఇబ్బందిగా మారింది. వ్యవసాయం చేయలేకపోతున్నాం. సక్రమంగా నీటి విడుదల లేకపోవడంతో పొలాలన్నీ బీళ్లుగా మారిపోతున్నాయి. ప్రభుత్వం, అధికారులు సకాలంలో స్పందించి ఆయకట్టు చివరి భూములకు నీటిని విడుదల చేసి రైతుల కష్టాలు తీర్చాలి.

– వాదపల్లి లక్ష్మీనారాయణ, భక్తాళాపురం, పెన్‌పహాడ్ మండలం

## మోసంచేసి పారిపోయిన చిట్టీల వ్యాపారి అరెస్ట్

- అతడికి సహకరించిన మరో ముగ్గురిని కూడా అదుపులోకి తీసుకున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ టూటౌన్ సీఐ సోమనర్సయ్య

**మిర్యాలగూడ అర్బన్:** ఎంతో నమ్మకంగా ఉంటూ 46 మందితో చిట్టీలు కట్టించుకుని మోసంచేసి పారిపోయిన చిట్టీల వ్యాపారిని మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను టూటౌన్ సీఐ సోమనర్సయ్య మంగళవారం విలేకరులకు వెల్లడించారు. దామరచర్ల మండలం బొత్తలపాలెం గ్రామానికి చెందిన కటకం సైదిరెడ్డి గత కొన్నేళ్లుగా మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో నివాసముంటూ బియ్యం వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో కాలనీవాసులతో పరిచయం పెంచుకుని చిట్టీలు వేయడం ప్రారంభించాడు. 46మంది కాలనీవాసులు అతడి వద్ద చిట్టీలు వేశారు. మొదట్లో బాగానే చిట్టీ డబ్బులు చెల్లించిన సైదిరెడ్డి కొంతకాలంగా చిట్టీలు పాడిన వారికి డబ్బులు ఇవ్వకుండా మొహం చాటేస్తున్నాడు. అంతేకాకుండా అధిక వడ్డీ ఆశ చూపి 42 మంది నుంచి రూ.1.50కోట్లు అప్పుగా తీసుకున్నాడు. ఇటీవల చిట్టీ పాడినవారు డబ్బుల కోసం సైదులు ఇంటికి వెళ్లగా తాళం వేసి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖరరాజు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు సోమవారం ఉదయం మిర్యాలగూడ పట్టణంలోని శ్రీమన్నారాయణ ఫంక్షన్‌హాల్ వద్ద సైదిరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అంతేకాకుండా సైదిరెడ్డి పారిపోయేందుకు సహకరించిన శాంతినగర్‌కు చెందిన కటకం వెంకట్‌రెడ్డి, ముత్తిరెడ్డికాలనీకి చెందిన మామిళ్ల వెంకన్న, రామ్‌నగర్‌కు చెందిన గుణగంటి జానయ్యను కూడా అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. చిట్టీలు కట్టిన బాధితులకు తగిన న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్‌ఐలు బి. రాంబాబు, డి. హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కల్వర్టు గోడను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

- 10 మంది ప్రయాణికులకు గాయాలు


క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

**కట్టంగూర్:** ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ హైవేపై కల్వర్టు గోడను ఢీకొట్టడంతో 10మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ ఘటన హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామ శివారులో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేవీఆర్ ట్రావెల్స్ బస్సు సోమవారం అర్ధరాత్రి 30మంది ప్రయాణికులతో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు బయల్దేరింది. మంగళవారం తెల్లవారుజామున మార్గమధ్యలో కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామ శివారులోకి రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో బస్సు అదుపుతప్పి విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గల కల్వర్టు గోడను ఢీకొట్టింది. దీంతో ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే బస్సులో నుంచి కిందకు దిగేందుకు ప్రయత్నించగా డోర్ లాక్ కావడంతో బయటకు వెళ్లలేకపోయారు. సమాచారం తెలుసుకున్న కట్టంగూర్ 108 సిబ్బంది, పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని బస్సు అత్యవసర డోర్‌ను ధ్వంసం చేసి ప్రయాణికులను బయటకు తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న సత్యవతి, లక్ష్మి, గణపతిరెడ్డితో పాటు మరో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనాల్లో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. బస్సు ఓనర్ ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం. రవీందర్ తెలిపారు.

## నీటి సంపులో పడి చిన్నారి మృతి


మహదేవ్ (ఫైల్)

**కోదాడరూరల్:** ఆడుకుంటూ వెళ్లి ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపులో పడి చిన్నారి మృతిచెందాడు. ఈ ఘటన కోదాడ మండలం గుడిబండ గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిబండ గ్రామానికి చెందిన శ్రీపాది గోపి, నాగేశ్వరి దంపతులకు కుమారుడు మహదేవ్(20 నెలలు) ఉన్నాడు. గోపి మంగళవారం మిర్యాలగూడలో కార్పెంటర్ పనికి వెళ్లగా.. నాగేశ్వరి కుమారుడితో కలిసి ఇంటి వద్దే ఉంది. మధ్యాహ్నం సమయంలో నాగేశ్వరి కుమారుడితో కలిసి ఇంట్లో నిద్రించింది. ఈ క్రమంలో మహదేవ్ నిద్రలేచి ఆడుకుంటూ వెళ్లి ఇంటి ఆవరణలో ఉన్న సంపులో పడ్డాడు. అరగంట తర్వాత నాగేశ్వరికి మెళకువ వచ్చి చూడగా పక్కన కుమారుడు లేకపోవడంతో సంపులో చూడగా అందులో మహదేవ్ మృతిచెంది ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చిన్నారి తండ్రి గోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం. అనిల్‌రెడ్డి తెలిపారు.

### పరిశ్రమ ఎదుట రైతుల ఆందోళన

**చౌటుప్పల్ రూరల్:** వ్యర్థ రసాయనాలతో భూగర్భ జలాలను కలుషితం చేస్తున్న చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం పరిధిలోని జై లారా డ్రగ్స్ కంపెనీపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామానికి చెందిన మహిళా రైతులు మంగళవారం కంపెనీ ఎదుట ఆందోళన చేశారు. పొల్యూషన్ బోర్డు అధికారులు నామమాత్రపు తనిఖీలు చేసి మాముళ్ల మత్తులో పడ్డారని ఆరోపించారు. ఆందోళన చేస్తున్న తమపై కంపెనీ యాజమాన్యం కేసులు పెట్టి భయ భ్రాంతులకు గురి చేస్తుందన్నారు. ఈ విషయమై కంపెనీ యాజమాన్యాన్ని వివరణ కోరగా కావాలని కొంతమంది కంపెనీపై దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. ఎక్కడా నిబంధనలు అతిక్రమించడం లేదని యాజమాన్యం స్పష్టం చేసింది.

### ఎంజీయూలో క్రీడా పోటీల నిర్వహణపై తీర్మానం

**నల్లగొండ టూటౌన్:** మహాత్మాగాంధీ యూనివర్సిటీలో 2025–26 విద్యా సంవత్సరంలో నిర్వహించనున్న వివిధ క్రీడా పోటీల నిర్వహణపై యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు మంగళవారం నిర్వహించిన సమావేశంలో తీర్మానం చేసింది. ఇంటర్ యూనివర్సిటీ క్రీడా పోటీలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు, ఖర్చులు, విద్యార్థుల డ్రెస్ కోడ్, ఎక్కడెక్కడ పాల్గొనాలనే దానిపై సమావేశంలో స్పోర్ట్స్ బోర్డు సభ్యులు చర్చించారు. క్రీడా పోటీల్లో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. స్పోర్ట్స్ సర్టిఫికెట్స్, కోచ్‌లు, మేనేజర్ సెలక్షన్, ఇతర వివరాలకు సంబంధించి ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అనుమతి తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించినట్లు బోర్డు సభ్యులు తెలిపారు.

### నీటిలో గల్లంతైన ఉద్యోగి మృతదేహం లభ్యం

**మఠంపల్లి:** మఠంపల్లి మండలం యాతవాకిళ్ల వద్ద గల వేములూరు రిజర్వాయర్ పవర్‌ప్లాంట్ గేట్ల మరమ్మతుల కోసం నీటిలో దిగి గల్లంతైన తాత్కాలిక ఉద్యోగి షేక్ ఉస్మాన్ మృతదేహం సోమవారం అర్ధరాత్రి లభ్యమైనట్లు మఠంపల్లి ఎస్‌ఐ పి. బాబు తెలిపారు. హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు చొరవతో నాగార్జునసాగర్ నుంచి గజ ఈతగాళ్లను పిలిపించి గాలింపు చర్యలు చేపట్టడంతో మృతదేహం దొరికిందని ఎస్‌ఐ పేర్కొన్నారు. ఉస్మాన్ స్వస్థలం నేరేడుచర్ల మండలం పీర్లగూడెం కాగా మంగళవారం మృతదేహానికి పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

## బండరాయి మీద పడి యువకుడి మృతి


ఆస్పత్రి ఆవరణలో రోదిస్తున్న మృతుడి బంధువులు

**మోత్కూరు:** బండరాయి కొడుతుండగా.. ప్రమాదవశాత్తు మీద పడి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామంలో మంగళవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని కాశవారిగూడేనికి చెందిన షేక్ నాగుల్‌మీరా (31), మరో ఆరుగురు కలిసి మంగళవారం బుజిలాపురం గ్రామ ప్రధాన రహదారి వెంట బీరప్ప గుడి వద్ద గల గుట్ట దగ్గర బండ కొట్టే పనికి వెళ్లారు. పెద్ద బండ రాయిని కొడుతుండగా.. అందులో నుంచి ఒక బండ ఊడి షేక్ నాగుల్‌మీరా మీద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు.


షేక్ నాగుల్ మీరా (ఫైల్)

అతడితో ఉన్న ఇమామ్ (మామ), షేక్ హోలి, షేక్ జాన్‌బాషా, షేక్ మౌలానా, షేక్ పక్కీర్‌లు బండ పైనుంచి పక్కకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. వారికి స్వల్ప గాయాలయ్యాయి. నాగుల్‌మీరాను వెంటనే అంబులెన్స్‌లో మోత్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య ఇమామ్‌బీ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఘటనా స్థలాన్ని మోత్కూరు ఇన్‌స్పెక్టర్ సి. వెంకటేశ్వర్లు, హెడ్‌కానిస్టేబుల్ నర్సింహ పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



### కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు

**భూదాన్‌పోచంపల్లి:** కోతుల దాడిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం సాయంత్రం పోచంపల్లి పట్టణ కేంద్రంలో జరిగింది. పోచంపల్లి పట్టణ కేంద్రంలోని పదో వార్డులో జింకల వెంకటమ్మ ఒంటరి నివాసముంటోంది. మంగళవారం సాయంత్రం కోతుల గుంపు వెంకటమ్మ ఇంట్లోకి ప్రవేశించి ఆమెపై దాడి చేశాయి. భయంతో ఆమె బయటకు వచ్చే క్రమంలో కిందపడిపోయింది. దీంతో తుంటి ఎముక విరిగింది. ఇరుగుపొరుగు వారు వచ్చి కర్రలతో కోతులను తరిమేశారు. గాయపడిన వెంకటమ్మను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోచంపల్లి మున్సిపాలిటీ కేంద్రంలో కోతుల బెడద నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు.

### తేలు కాటుతో నాలుగేళ్ల బాలుడు మృతి


రుత్విక్‌రెడ్డి (ఫైల్)

**నకిరేకల్:** తేలు కాటుకు గురై నాలుగేళ్ల బాలుడు మృతిచెందాడు. నకిరేకల్ మండలం పాలెం గ్రామ శివారులోని టీకులగూడెంలో నివాసముంటున్న పక్కీరు పురుషోత్తంరెడ్డికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం. కుమార్తె 3వ తరగతి చదువుతుండగా.. కుమారుడు రుత్విక్‌రెడ్డి(4) పాలెం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నర్సరీ చదువుతున్నాడు. గత నెల 29న రుత్విక్‌రెడ్డికి ఇంట్లో తల్లి స్నానం చేయించి అతడికి నిక్కర్ తొడిగింది. అప్పటికే నిక్కర్‌లో ఉన్న తేలు రుత్విక్‌రెడ్డిని కుట్టడంతో అతడు కేకలు వేశాడు. వెంటనే బాలుడిని నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడి తండ్రి పురుషోత్తంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### విద్యుదాఘాతంతో అపస్మారక స్థితిలోకి రైతు

- సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

**వేములపల్లి:** విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిన రైతు ప్రాణాలను 108 సిబ్బంది సీపీఆర్ చేసి కాపాడారు. ఈ ఘటన వేములపలల్లి మండల కేంద్రం శివారులో మంగళవారం జరిగింది. మాడుగులపల్లి మండలం ఇసుకబాయిగూడెం గ్రామానికి చెందిన రైతు వల్లపుదాసు చంద్రయ్య మంగళవారం వేములపల్లి గ్రామ శివారులోని తన పొలం వద్ద బోరుకు మోటారు బిగించేందుకు వెళ్లాడు. బోరు మోటారు బిగిస్తుండగా విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సమీపంలోని రైతు మంచికంటి వెంకట్‌రెడ్డి గమనించి ఫోన్ ద్వారా 108 సిబ్బందికి, చంద్రయ్య కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. 108 సిబ్బంది వెలిజాల సైదులు, పగిళ్ల జానకిరాములు ఘటనా స్థలానికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న చంద్రయ్యకు సీపీఆర్ చేయగా అతడు స్పృహలోకి వచ్చాడు. వెంటనే అతడిని 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చంద్రయ్య ప్రాణాలు కాపాడిన 108 సిబ్బందికి కుటుంబ సభ్యులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**కొండమల్లేపల్లి:** బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు అదుపుతప్పి రోడ్డు పక్కన ఐరన్ గ్రిల్స్ ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు.. కొండమల్లేపల్లి మండలం చింతకుంట్ల గ్రామానికి చెందిన ఐతరాజు అజయ్(22) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఐతరాజు అంజి కొండమల్లేపల్లిలోని ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి వీరిద్దరు బైక్‌పై కొండమల్లేపల్లి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా.. మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులో శత్రునాయక్‌తండా సమీపంలో గల పెట్రోల్ బంక్ వద్ద బైక్ అదుపుతప్పడంతో రోడ్డు పక్కన ఉన్న ఐరన్ గ్రిల్స్‌ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో అజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వెనుక కూర్చున్న అంజికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

## పథకం ప్రకారమే వివాహిత హత్య..?

- నిందితుడి తీరుపై పలు అనుమానాలు
- కొనసాగుతున్న విచారణ
- ఫోన్ కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న గడ్డి మందు డబ్బా

**గుర్రంపోడు:** గుర్రంపోడు మండలం జూనూతల గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు మహేష్ సోమవారం అదే గ్రామానికి చెందిన వివాహితపై అత్యాచారం చేసి ఇంజెక్షన్ ద్వారా ఆమెకు గడ్డి మందు ఇచ్చి హత్య చేసిన విషయం తెలిసిందే. పోలీసులు తమదైన శైలిలో విచారిస్తున్నప్పటికీ.. తనను వివాహిత బ్లాక్‌మెయిల్ చేస్తున్నందునే ఆమెను పాశవికంగా హత్య చేశానని నిందితుడు చెబుతున్నట్లు తెలుస్తోంది. కానీ బలమైన కారణంతోనే నిందితుడు ఆమెను హతమార్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతురాలి, నిందితుడి ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకుని వాట్సాప్, ఫోన్ కాల్ డేటాను సేకరిస్తున్నారు. చికిత్స పొందుతున్న సమయంలో మృతురాలు డాక్టర్‌కు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే నిందితుడు గడ్డి మందు(ట్రైకాట్) డబ్బాను గుర్రంపోడు మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణం నుంచి పది రోజుల ముందే కొనుగోలు చేసి కారులో ఉంచుకుని పక్కా ప్రణాళికతో ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గడ్డి మందు డబ్బాపై గల బ్యాచ్ నంబర్‌ను బట్టి గుర్రంపోడు మండల కేంద్రంలోనే గడ్డి మందు కొనుగోలు చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. నిందితుడి స్వగ్రామం సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాల గ్రామం కాగా.. అతడు ఎనిమిదేళ్లు అక్కడే ఆర్‌ఎంపీ వైద్యుడిగా పనిచేశాడు. నిందితుడి తోడల్లుడు గుర్రంపోడు మండలం వట్టికోడు గ్రామంలో ఆర్‌ఎంపీ వైద్యుడిగా స్థిరపడడంతో అతడి ద్వారా జూనూతల గ్రామంలో ఆర్‌ఎంపీ వైద్యుడు లేడని తెలుసుకుని ఇక్కడ ఇంటిని అద్దెకు తీసుకుని భార్యాపిల్లలతో ఉంటున్నట్లు తెలిసింది.

**అంతుచిక్కని నిందితుడి నైజం..**

నిందితుడు మహేష్ జూనూతల గ్రామంలో ఎనిమిదేళ్లుగా ఉంటున్నా అతడు ముభావంగా ఉంటూ కనీసం ఇంటి పక్కన వాళ్లతోనూ పెద్దగా మాట్లాడేవాడు కాదని, అతడికి గ్రామంలో ఏ ఒక్కరితోనూ మిత్రుత్వం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే నిందితుడు గతంలోనూ తన బంధువుకు ఫోన్‌లో అసభ్యకరమైన మెసేజ్‌లు పంపగా.. ఈ విషయంపై వారు రాజీపడినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

## లోతు దుక్కులతో బహుళ ప్రయోజనాలు

- కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త చంద్రశేఖర్ సూచనలు


చంద్రశేఖర్, కేవీకే శాస్త్రవేత్త

**త్రిపురారం:** వానాకాలం సాగులో భాగంగా తొలకరి వర్షాలు కురిసిన తర్వాత రైతులు దుక్కులు దున్నుకోవడం మొదలుపెడతారు. నాగార్జునసాగర్ ఆయకట్టులో మాత్రం తొలకరి తర్వాత కాస్త ఆలస్యంగా దుక్కులు దున్ని విత్తనాలు పెడతారు. అయితే లోతు దుక్కులు దున్నుకోవడం ద్వారా చాలా ఉపయోగాలు ఉన్నాయని కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం సేద్యపు విభాగం శాస్త్రవేత్త చంద్రశేఖర్ సూచిస్తున్నారు.



- తొలకరి వర్షాలు కురిసిన తర్వాత ట్రాక్టర్ ఫ్లవ్, రోటావేటర్ల ద్వారా పొలాన్ని దున్నుకోవచ్చు.
- లోతు దుక్కులు దున్నడం వలన పొలంలో కలుపు మొక్కలు పెకలించబడతాయి. దీంతో పంటల సాగులో కలుపు సమస్య తగ్గుతుంది.
- భూమి లోపలి గట్టి పొరలు పగలడం వల్ల మొక్కల వేరు వ్యవస్థ లోపలికి చొచ్చుకొని వెళ్తాయి. వేరు వ్యవస్థ నేలలోకి బాగా విస్తరించడం వల్ల మొక్కల ఎదుగుదలకు కావాల్సిన తేమ, పోషకాలు అందుతాయి.

పాడిపంట

- పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులను అభివృద్ధి పరుచుటకు లోతు దుక్కులు తోడ్పడతాయి.
- పంటలకు ఆశించే శిలీంధ్రాలు సైతం లోతు దుక్కులతో ఎండ తాకిడికి చనిపోతాయి.
- వివిధ పంటల్లో వచ్చే ఎండు తెగులు అదుపులో ఉంటుంది.
- సరైన సమయంలో దుక్కులు దున్నడం వల్ల వర్షపు నీరు నేలలోకి ఇంకి తేమ శాతం వృద్ధి చెందుతుంది.
- దీంతో నేల గుల్లబారి విత్తనం నాటేందుకు అనుకూలంగా మారుతుంది. తద్వారా మొలక శాతం పెరుగుతుంది.
- అంతేకాకుండా పంట మొదళ్లు, ఆకులు, చెత్త నేలలో కలిసిపోయి సేంద్రియ పదార్థంగా మారి నేల సారవంతంగా మారుతుంది.